క్లుప్తంగా

నిత్య వ్యాయామం ఆరోగ్యానికి శ్రేయస్కరం


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్

మల్కాపురం: నిత్యం ఆరోగ్యవంతంగా ఉండాలంటే వ్యాయామం తప్పని సరి అని పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పార్కు వద్ద కోరమండల్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శనివారం ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,కోరమాండల్ సంస్థ డీజీఎం(హెచ్.ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ ఎస్.వెంకటరమణ,ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్,రేవళ్ల సత్యనారాయణ,పొట్టిమూర్తి పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం కూల్చివేత


భవనం పైకప్పు కూల్చివేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సమీపంలోని సుసర్లకాలనీలో అనుమతుల్లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని శనివారం నగరపాలక సంస్థ అధికారులు కూల్చివేశారు. జీవీఎంసీ నుంచి ముందస్తుగా తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనుమతుల్లేకుండా నిర్మాణం చేపట్టవద్దని సూచించారు. అయినప్పటికీ నిర్మాణం చేస్తుండడంతో ఆగ్రహించిన 8వ జోన్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అనుమతుల్లేకుండా వేసిన భవనం పై ఫ్లోర్‌ను కూల్చివేశారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


గరుడ సేవలో భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కారు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి సమీపంలో శనివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ కారుతో ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలివి.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కంది వెంకట ఉదయ కిరణ్ (49) తన ద్విచక్ర వాహనంపై కూర్మన్నపాలెం ఆర్చి నుంచి వ్యతిరేక మార్గంలో స్టీల్‌ప్లాంట్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో టౌన్‌షిప్‌కు చెందిన హర్ష రోహిత్ టొప్పో తన స్నేహితుడు అర్పిత్ టొప్పోతో కలిసి కూర్మన్నపాలెం వైపు కారులో వెళ్తున్నారు. ఆర్చి సమీప స్కూటర్ షెడ్డు దగ్గరకు వచ్చే సరికి వారు కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదం ధాటికి కారు ఎయిర్ బెలూన్లు ఓపెన్ అయ్యాయి. ఈ సంఘటనలో ఉదయ కిరణ్ అపస్మారక స్థితికి చేరుకున్నారు. అదే సమయంలో అటుగా ప్రయాణిస్తున్న ఓ యువకుడు కిరణ్‌కు సీపీఆర్ చేసి ఊపిరి ఉందని చెప్పటంతో వెంటనే అతడిని గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. ప్రస్తుతం కిరణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

దుర్గమ్మా పాహిమాం


పిలకవానిపాలెంలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్


90వ వార్డు వినోద్ నగర్‌లో అమ్మవారు


రెడ్డి వీధిలో అమ్మవారు


సుసర్ల కాలనీలో పూజల్లో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. ప్రత్యేక మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

- 90వ వార్డు సుసర్ల కాలనీ శివాలయ ఆలయ కమిటీ, వినోద్ నగర్ గణేష్‌యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని కార్పొరేటర్ బొమ్మిడి దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విమాన్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- 52వ వార్డు అంబేడ్కర్ నగర్, కరాస కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గమ్మ విగ్రహాలను భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.
- 90వ వార్డు బుచ్చిరాజుపాలెం శ్రీ దుర్గాలమ్మ-శ్రీ బంగారమ్మ ఆలయంలో కలశ పూజ శాస్త్రోక్తంగా జరిగింది. అమ్మవారు శనివారం మహిసా సురమర్దిని అవతావరంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దుర్గమ్మను దర్శించుకున్న నాయకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు నరసింహనగర్‌లోని మండపంలో దుర్గాదేవిని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మార్కండేయ రాజశేఖర్, కడిమి రామకృష్ణ, కె త్రినాథ్, ఒరుబిల్లి విజయ, సువర్ణ, వెంకటరమణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

- 89వ వార్డు కొత్తపాలెంలో 5 స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు పాల్గొని మండపంలో పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నసమారాదనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో రెడ్డి వెంకట్, మర్రపు సంతోష్, చిన్ని, ఆడారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- 89వ వార్డు కొత్తపాలెం నాగేంద్ర కాలనీలో దుర్గాదేవిని ఎమ్మెల్యే గణబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి విశేష పూజలు

మల్కాపురం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పారిశ్రామిక ప్రాంతంలో ఘనంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 58వ వార్డు పిలకవానిపాలెంలోని దుర్గాదేవి ఆలయంలో గురుభవానీ శివరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన చేశారు. అనంతరం ఆయన గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల దుర్గాదేవి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. 59వ వార్డు నక్కవానిపాలెంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆడారి ప్రారంభించారు. ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సరేష్‌యాదవ్, పొట్టి మూర్తి, అమరావతి, రేవళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ అనంతరం 61వ వార్డు వెంకన్నపాలెంలో జరిగిన పూజల్లో ఆడారి ఆనంద్ కుమార్ పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలో డేరింగ్ అండ్ డాషింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో దుర్గమ్మ లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


నరసింహనగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న బెహరా భాస్కరరావు


కొత్తపాలెంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు


నాగేంద్ర కాలనీలో దుర్గాదేవి సన్నిధిలో ఎమ్మెల్యే గణబాబు, చిన్నారులు

కుటుంబీకుల చెంతకు యువతి


యువతిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత, చిత్రంలో సీఐ ప్రసాద్

విశాఖ విద్య: ఒడిశా రాష్ట్రంలోని సంబల్‌పూర్ నుంచి విశాఖపట్నం వచ్చిన యువతికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత మూడు నెలల పాటు ఆశ్రయం కల్పించి శనివారం కుటుంబీకులకు అప్పగించారు.దీంతో సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు.. లక్ష్మీ మహానంద్ అనే యువతి ఇంట్లో గొడవపడి బయటకు రాగా, ఆ సమయంలో ఎవరో యాక్సిడెంట్ చేసి ట్రెన్ ఎక్కించడంతో విశాఖపట్నం చేరుకుంది. ఫుట్‌పాత్‌పై నాలుగు రోజుల పాటు తిండి లేక అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువతిని గుర్తించిన రైల్వే పోలీసులు మమత చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమతకు సమాచారం అందించారు. స్పందించిన మమత ఆ యువతిని కేజీహెచ్‌కు తీసుకెళ్లి తగిన వైద్యసేవలు అందించేలా ఏర్పాట్లు చేసింది. కేజీహెచ్ నుంచి డిశ్చార్జ్ చేసిన తర్వాత బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షెల్టర్‌లో ఆశ్రయం కల్పించింది. సాధారణ స్థితికి వచ్చిన ఆ యువతి తన వివరాలు చెప్పడంతో కుటుంబ సభ్యుల గురించి మమత ఆరా తీశారు. ఆమె అన్నయ్య ప్రకాష్ నంద తన చెల్లిని ఇంటికి తీసుకెళ్తానని తెలియజేశాడు. ఎయిర్‌పోర్ట్ సీఐ బీఎండీ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీ మహానంద్‌ను ఆమె అన్నయ్యకు అప్పగించారు.

'పోష్' కమిటీ ఏర్పాటు అవసరం



మాట్లాడుతున్న దిశా సీఐ నిర్మల

సీతంపేట: అంతర్జాతీయ ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ యాక్షన్‌ఎయిడ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి దిశా పోలీస్ స్టేషన్ సీఐ నిర్మల మాట్లాడుతూ కార్యాలయాలు, కళాశాలలు, వ్యాపార వాణిజ్య సంస్థలు ఇలా మహిళలు పనిచేసే ఏ ప్రదేశంలోనైనా పది నుంచి 15 మంది మహిళలు ఉంటే పోష్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక వేళ పురుషుల నుంచి గాని, మహిళల నుంచి గాని లైంగిక వేధింపులు ఎదుర్కొంటే పోష్ కమిటీ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటుందన్నారు. సంస్థ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ దుడ్డి ఇందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పోష్ కమిటీ సభ్యులు కోరాడ స్వర్ణ, యాక్షన్‌ఎయిడ్ ఆఫీసర్ డాక్టర్ ఇర్ఫాన్, వెండర్స్ కమిటీ సభ్యులు ఎర్రబిల్లీ ప్రభాకర్, ట్రాన్స్‌జెండర్ ప్రతినిధి అమిత్ తదితరులు లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి


డి.పి.దేవ్, అన్నాజీరావులను సన్మానిస్తున్న రామ్మోహనరావు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల(శ్రీశయన) కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఇటీవల నియమితుడైన విశ్రాంత తహసీల్దార్, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.పి.దేవ్, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన ఐహెచ్‌ఆర్ఏ రాష్ట్ర కార్యదర్శి సనపల అన్నాజీరావులను సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహనరావు ఆధ్వర్యంలో శనివారం మాధవధారలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిరువురు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘానికి అందించిన సేవలను కొనియాడారు. నూతన హోదాలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తారని, మానవ హక్కుల పరిరక్షణకు మరింతగా పాటుపడాలని రామ్మోహనరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, దళిత సేన అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మేలు చేసే ప్రభుత్వం

వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల

విశాఖ విద్య: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగులకు మేలు చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తోందని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా శనివారం డీఏ మంజూరు చేస్తూ, ఉత్తర్వులు జారీ చేయటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కోవిడ్ విపత్తు తరువాత తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, వాటన్నింటినీ అధిగమిస్తూ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను ఒక్కొటి పరిష్కరిస్తోందన్నారు. మిగతా ప్రయోజనాలను సైతం మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగానే పని చేస్తున్నారన్నారు. కొంతమంది కావాలనే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూల వాతావరణంలో ఎమ్మెల్సీల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వైఎస్సార్‌టీఎఫ్ పక్షాన వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయం


ర్యాలీలో పాల్గొన్న సీఐ జి.డి.బాబు, ఎస్ఐ నాగరాజు

మల్కాపురం: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహిస్తారని మల్కాపురం సీఐ జి.డి.బాబు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా శనివారం సిబ్బందితో కలిసి సీఐ జి.డి.బాబు విధి నిర్వహణలో అమరులైన పోలీసుల ఆత్మకు శాంతి కలగాలని ర్యాలీ మల్కాపురం నుంచి శ్రీహరిపురం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ అంటే ప్రజలకు ఒక భరోసా అని,పోలీస్ అంటే ప్రజలకు ఒక నమ్మకం అని అన్నారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా తమ వ్యవస్థ ఎల్లప్పుడూ నడుచుకుంటుందన్నారు. విధి నిర్వహణలో అమరులైన వారి సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాటరీ కారులో పర్యవేక్షణ


భవనాల పరిశీలనకు బ్యాటరీ కారులో వెళుతున్న అధికారులు

ఏయూ క్యాంపస్: పర్యావరణ హిత ఆంధ్ర విశ్వవిద్యాలయం కోసం అధికారులు మరో అడుగు వేశారు. వర్సిటీలో భవనాల పరిశీలనకు శనివారం బ్యాటరీ వాహనంలో వెళ్లారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వాహనాన్ని స్వయంగా నడపగా, వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్ డాక్టర్ జి.వీర్రాజు వెనక కూర్చుని పర్యవేక్షించారు. వర్సిటీలో భవిష్యత్తులో బ్యాటరీ వాహనాల వినియోగం పెంచుతామని అధికారులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఐక్య పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేసు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా సంఘటితంగా కాపాడుకుందామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతుందన్నారు. ప్రైవేటీకరణను ఉపసంహరించుకునేంత వరకు ఐక్య పోరాటం కొనసాగుతుందన్నారు. బీఎఫ్-3ని జిందాల్ లాంటి ప్రైవేటు వారికి ఇచ్చి నడిపిస్తామంటే ఒప్పుకోబోమన్నారు. దానికి ఉక్కు యాజమాన్యమే పునఃప్రారంభించి పూర్తి స్థాయిలో నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్ ఏఐటీయూసీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, మసేనురావు, డి.నర్సింగరావు, నరేష్‌కుమార్, మిశ్రా, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

దసరా సంబరాలను విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి
- వేదిక : గోపాలపట్నం హైస్కూల్ మైదానం


ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో ఆదివారం నిర్వహించనున్న విజయదశమి సంబరాలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. సభా ప్రాంగణాన్ని శనివారం ఆయన డిప్యూటీ మేయర్ శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావుతో కలిసి పరిశీలించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సంబరాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని పొదుపు సంఘాల సభ్యులు, సచివాలయ కార్యదర్శులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొంటారని అందకు తగిన విధంగా ఏర్పాట్లు ఉండాలని సూచించారు.

తరలి రావాలి

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం నిర్వహించనున్న విజయదశమి సంబరాలను విజయవంతం చేయాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కోరారు.శనివారం ఆయన నివాసంలో 91,92 వార్డుల పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆర్పీలు, పొదుపు సంఘాల సభ్యులు, నాయకులు మహిళలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

- జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా
- గోపాలపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం
- 480 మందికి వైద్య పరీక్షలు


జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని జీవీఎంసీ కోఆప్షన్ బెహరా భాస్కరరావు అన్నారు. 480 సచివాలయం పరిధిలోని ప్రాంతాల వారికి శనివారం గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జగన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పేదలకు సైతం ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలనే ఆలోచనతో సీఎం వైఎస్ జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. దీంతో వైద్య సిబ్బందే ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని సేవలందిస్తున్నారని చెప్పారు. దీర్ఘకాలిక వైద్యం అందించేందుకు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, వలంటీర్లు నిత్యం పర్యవేక్షిస్తారన్నారు. లక్ష్మీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు పూజ పర్యవేక్షణలో వైద్య శిబిరం జరిగింది. ఆర్థోపెడిక్, గైనిక్, పిల్లల వైద్యులు, కంటి వైద్యులు, జనరల్ మెడిసిన్ వైద్యనిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్షయ వ్యాధి విభాగం సిబ్బంది ప్రత్యేక కౌంటర్ ద్వారా వ్యాధిగ్రస్తులకు సేవలు అందించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బల్లంకి వెంకటరావు, పి. వెంకటరమణ, కమలా దేవి, రోజా రాణి, ఉష, లక్ష్మి, సరళ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

22 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో ఈనెల 22 నుంచి 28 వరకు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జి.వి.రమాబాయి తెలిపారు. 22 సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారన్నారు. బ్రహ్మశ్రీ కలగా మురళీకృష్ణచే దేవీమహత్యంపై ప్రవచనం, 23 సాయంత్రం 6 గంటలకు రేడియో, టీవీ ఆర్టిస్ట్ యతిరాజు భాగవతార్ ఆధ్వర్యంలో హరికథా గానం, 24న సుధా సీతాపతిరావుచే హరేరామ సంకీర్తన, 25న సిరి డ్యాన్స్ అకాడమీ స్వర్ణ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, 26న సాయిరాజు భక్తి రంజని బృందంచే భజనలు, 27న వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ప్రతినిధి కె.సునీత సారథ్యంలో కోలాటం, 28 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు లలితా మాతృ మండలి మహిళా సభ్యులచే సామూహిక పారాయణ జరుగుతాయన్నారు.

982వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు


982వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 982వ రోజు, శనివారం ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమర వీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. నిరంతరాయంగా పోరాటాన్ని కొనసాగించడం ద్వారా కేంద్రప్రభుత్వంపై ప్రతిఘటన మరింత పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కార్మికులు తలచుకుంటే ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి కార్మికులకు అండగా నిలబడాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.